# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 03-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత్ అమెరికాతో చారిత్రక వాణిజ్య ఒప్పందం చేసుకోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు.
- ❖ తిరుమల లడ్డూ తయారీ కల్తీ వ్యవహారంలో సూత్రధారులను గుర్తించేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.
- ❖ భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంతో రాష్ట్రంలోని ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు.
- ❖ రాష్ట్రంలో క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా ఏటా 600 కోట్ల రూపాయల విలువైన వైద్య సేవలు అందిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

======================

భారత్ - అమెరికాతో చారిత్రక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్.. ప్రపంచ ఆర్థికశక్తి కేంద్రంగా తన పాత్రను సుస్థిరం చేసుకుంటోందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సుంకాలను 18 శాతానికి తగ్గించడం ప్రపంచంలోని రెండు గొప్ప ప్రజాస్వామ్య దేశాల మధ్య బంధాన్ని బలోపేతం చేస్తుందన్నారు. నిరంతరం ప్రపంచ వృద్ధిని కాంక్షించేలా ఈ దార్శనిక నిర్ణయం ఉందన్నారు. భారత ఎగుమతుల్లో పోటీ తత్వాన్ని గణనీయంగా పెంచేలా ఈ ఒప్పందం ఉందని ఇది ఆంధ్రప్రదేశ్ సహా దేశ యువత, రైతులకు అపారమైన అవకాశాలను సృష్టిస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

======================

అమెరికా ప్రభుత్వం భారతీయ సముద్ర ఆహార ఎగుమతులపై విధించిన సుంకాలను 25 నుంచి 18 శాతానికి తగ్గించడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. భారత్, అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ప్రకారం ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని ఈరోజు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. అధిక సుంకాల కారణంగా గత ఏప్రిల్ నుండి నవంబర్ వరకు ఎగుమతులు 15 శాతం మేర తగ్గాయని

చెప్పారు. తాజా నిర్ణయంతో అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల పోటీ సామర్థ్యం పెరుగుతుందని, ఫ్రోజెన్ ష్రింప్ సహా సముద్ర ఆహార ఎగుమతులు 10 నుండి 15 శాతం వరకు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. ఆక్వా రంగంలో అగ్రస్థానంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కు ఈ సుంకాల తగ్గింపు ప్రోత్సాహకంగా మారుతుందని, రైతులు, మత్స్యకారులకు ఆదాయ స్థిరత్వం, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

======================

రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం ఈరోజు జరిగింది. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్ యాదవ్ లు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... మంత్రివర్గ సమావేశంలో ప్రధానంగా తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపైనే చర్చించామని తెలిపారు. తిరుమల లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. 2022లో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే విస్మరించిందన్నారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించిందని పయ్యావుల కేశవ్ తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

రాష్ట్రంలో క్యాన్సర్ కేసుల నియంత్రణ, వైద్య సేవలు మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రాణాంతకంగా మారిన క్యాన్సర్ పై పోరాటం చేసేందుకు అందరూ కలిసి రావాలని మంత్రి పిలుపునిచ్చారు. ముందస్తు జాగ్రత్తలు, తగిన ప్రాథమిక పరిశీలన ద్వారా క్యాన్సర్ ను ప్రారంభ దశలోని అరికట్టవచ్చునని పేర్కొన్నారు. ఫిబ్రవరి 4వ తేదీ క్యాన్సర్ డే పురస్కరించుకొని రాష్ట్రంలో ఉన్న క్యాన్సర్ వ్యాధి గ్రస్తులు వారి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, తీసుకోబోతున్న చర్యల గురించి ఈ రోజు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మంత్రి వివరించారు. క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు ఉచితంగా ఏటా 600 కోట్ల రూపాయల విలువైన వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. బోధనాసుపత్రుల్లో “పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్” సేవలపై వైద్యులకు శిక్షణ ఇస్తున్నామని, ప్రతి జిల్లా కేంద్రంలో నూ డే కేర్ కీమోథెరపీ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. క్యాన్సర్ కేసులతో రూపొందించిన అట్లాస్ ఆధారంగా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. క్యాన్సర్ వ్యాధుల పట్ల ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తూనే ఎన్సీడీ-4.0 ద్వారా బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ లక్షణాలు కలిగిన వారిని ప్రాథమిక స్థాయిలోనే గుర్తించే ప్రక్రియను కొనసాగిస్తున్నామని మంత్రి తెలియజేశారు.

విరామం

======================

నీతి ఆయోగ్ ఆకాంక్షాత్మక జిల్లాల కార్యక్రమంలో భాగంగా “సంపూర్ణత అభియాన్ 2.0”ను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాధించాల్సిన లక్ష్యాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆస్పిరేషన్ డిస్ట్రిక్ట్స్ (ఆకాంక్షాత్మక జిల్లాల) పురోగతిలో జాతీయ స్థాయిలో వైఎస్ఆర్ కడప జిల్లా 73.6 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమం ద్వారా రాబోయే మూడు నెలల కాలంలో ఆరోగ్యం, పోషకాహారం, విద్య, వ్యవసాయం, జల వనరులు, ఆర్థిక సమ్మేళనం, నైపుణ్యాభివృద్ధి వంటి ఐదు ప్రధాన రంగాలలో నూరు శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆదేశించారు.

======================

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పాలకొండలో భారీ ఎత్తున స్వచ్ఛతా కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. గత రెండు పర్యటనల్లో గమనించిన అపరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో ఈరోజు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక హోటళ్లు, దుకాణాల యజమానులు పరిశుభ్రత పాటించకపోవడంపై మందలించారు. అపరిశుభ్ర పరిస్థితులకు కారణమయ్యే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పాలకొండను ఒక అందమైన, ఆరోగ్యకరమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అనంతరం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు.

=====================

రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, ఫేజ్ 3, 4 రీసర్వే ప్రక్రియ పనులు వేగవంతం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి కలెక్టరేట్ లో పట్టాదారు పుస్తకాలు, రీసర్వే, పి.జి.ఆర్.ఎస్, మ్యూటేషన్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ… రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని సంకల్పించిన దిశగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని సూచించారు.

=====================

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం సమీపంలో పెద్ద పులి సంచారంపై ఆందోళన చెందనవసరం లేదని, పులిని బంధించేందుకు అటవీ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో డ్రోన్ కెమెరాలు, బోనులు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ప్రజలకు స్పష్టం చేశారు. ఈ విషయమై జిల్లా అటవీ శాఖ అధికారితో ఆయన ఈరోజు ఫోన్ లో మాట్లాడి పులి సంచారానికి సంబంధించిన తాజా సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. గత కొన్ని రోజులుగా తొర్రేడు, సీతానగరం సమీపంలో పులి సంచరిస్తుందని, దాని ఆనవాళ్లు గుర్తించామని, త్వరలోనే పట్టుకుంటామని అధికారి తనకు చెప్పినట్లు మంత్రి తెలియజేశారు. తగిన జాగ్రత్తలు తీసుకొని త్వరితగతిన చర్యలు చేపట్టాలని, ప్రజలను అప్రమత్తం చేసేందుకు తక్షణమే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

=====================

రానున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పిఠాపురం పాదగయ క్షేత్రంలో భక్తుల భారీ రాకను దృష్టిలో ఉంచుకొని పోలీస్ బందోబస్తు, శాంతి భద్రతల ఏర్పాట్లను కాకినాడ జిల్లా కలెక్టర్ ఎస్. షణ్మోహన్, పోలీసు సూపరింటెండెంట్ బిందు మాధవ్ తో కలిసి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, సీసీ టీవీ కెమెరాల ఏర్పాట్లు, క్యూ లైన్ల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 216 నెంబరు జాతీయ రహదారి పరిధిలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా సమర్థవంతమైన ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు. శాంతియుత వాతావరణంలో మహాశివరాత్రి వేడుకలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

=====================

=====================